క్లుప్తంగా

అలిపిరి వద్ద వైఎస్సార్ సీపీ నేతల పూజలు



కొబ్బరి కాయలు కొడుతున్న నేతలు

తిరుపతి కల్చరల్: టీటీడీ చైర్మన్‌గా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నియమితులైన సందర్భంగా బాబూ జగ్జీవన్ భవన్ గౌరవాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నేత మోహన్‌రాజ్ ఆధ్వర్యంలో సోమవారం అలిపిరి పాదాల మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. 50,116 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రాపూరి రాజేష్, జీవన్, రాపూరి ప్రసాద్ పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



బీపీ మండల్‌కు నివాళులర్పిస్తున్న మేయర్ శిరీష, బీసీ నేతలు

తిరుపతి కల్చరల్: డీబీఆర్ రోడ్డులోని బీపీ మండల్ విగ్రహం వద్ద సోమవారం మండల్ నివేదిక అందజేసిన దినాన్ని ఘనంగా జరుపుకున్నారు. బీపీ మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేయర్ శిరీష, బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, గౌరవాధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు బీవీ.కేశవులు, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్, సాకం ప్రభాకర్, రజక, విశ్వబ్రాహ్మణ, యాదవ, వాల్మీకి, బోయ, గౌడ్ సంఘాల నేతలు పాల్గొన్నారు.

దేశ చరిత్ర తెలిసేలా విగ్రహాలు ఏర్పాటు

తిరుపతి తుడా : దేశ చరిత్ర భవిష్యత్ తరాలకు తెలిసేలా దండి మార్చ్ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె సోమవారం ఎమ్మార్‌పల్లి కూడలి వద్ద ఏర్పాటు చేస్తున్న దండి మార్చ్ విగ్రహాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పనులు పూర్తి చేసి ఆగస్టు 15న ప్రారంభిస్తామన్నారు. ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ మహేష్, తదితరులు ఉన్నారు. అనంతరం కమిషనర్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి శ్రీనివాస సేతు పనులను పరిశీలించారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

తిరుపతి కల్చరల్: మణిపూర్‌లో శాంతియుత వాతావరణాన్ని కల్పించాలని పలువురు వక్తలు కోరారు. మణిపూర్ ఘటనను ఖండిస్తూ ఏపీ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో బెస్ట్ మిషన్ చర్చి రెవరెండ్ జాన్సన్ ఆధ్వర్యంలో సోమవారం క్రిస్టియన్లు, ముస్లింలు, దళితులు సంయుక్తంగా క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. ర్యాలీని ఈస్ట్ నూతన చర్చి రెవరెండ్ బెంజిమెన్, డాక్టర్ ప్రవీణ్ జెండా ఊపి ప్రారంభించారు. వెస్ట్ మిషన్ కాంపౌండ్ నుంచి టౌన్‌క్లబ్, గాంధీ రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు సాగింది.

యువతకు మనోవికాస శిక్షణా తరగతులు



తిరుపతి సిటీ : ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరరావు సహకారంతో డాలర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10వ తేదీల్లో మహతి ఆడిటోరియంలో యువతకు మనోవికాస శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు డాలర్స్ గ్రూప్ చైర్మన్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ప్రకాశం రోడ్డులోని డాలర్స్ గ్రూప్ సంస్థ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శిక్షణా తరగతులకు హాజరయ్యే వారికి భోజన వసతి కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం సమావేశంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ డైరెక్టర్ నారాయణ, ట్రైనర్లు తహరునీషా బేగం పాల్గొన్నారు.

నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరుల చిద్విలాసం

పాకాల : ఊట్లవారిపల్లి సమీపంలోని ఆనందగిరిపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారం ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం, యాగ పూజ చేశారు. సాయంత్రం 8 గంటలకు పార్వతీ పరమేశ్వరులు నంది వాహనంపై కొలువుదీరి పాకాల వరకు ఊరేగారు. ఉభయదారులుగా ఏటుకూరి సుబ్బరామానాయుడు, కుటుంబసభ్యులు వ్యవహరించారు.

దళిత విద్యార్థులపై దాడి

తిరుపతి సిటీ : ఎస్వీయూ మాస్టర్ ప్లాన్ రోడ్లకు అనుకూలంగా మాట్లాడినందుకు పీజీ సోషియాలజీ విద్యార్థి యుగంధర్‌పై ఎస్వీయూఏ, గిరిజన నవ సమాజ్ నేతలు సోమవారం రాత్రి దాడి చేశారు. స్పృహ కోల్పోయిన అతన్ని రుయా ఆస్పత్రికి తరలించారు. గొడవను అడ్డుకునేందుకు ప్రయత్నించిన తనపైనా దాడికి పాల్పడి గాయపరిచారని ప్రత్యక్ష సాక్షి ప్రేమ్‌కుమార్ అనే విద్యార్థి తెలిపారు. ఎస్వీయూఏ పేరుతో బయటి వ్యక్తి మల్లికార్జున్, కొంతమంది దాడిచేయడం దారుణమన్నారు.

భూమనకు అభినందనల వెల్లువ









భూమన కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జాయింట్ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ బసిరెడ్డి, జిల్లా రవాణా శాఖాధికారి సీతారామిరెడ్డి, టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ మల్లికార్జున, పక్కన భూమన అభినయ్‌రెడ్డి, శ్రీశైలం ఆలయ చైర్మన్ చక్రపాణి

తిరుపతి మంగళం : టీటీడీ చైర్మన్‌గా నియమితులైన తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి సోమవారం రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జాయింట్ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్(జేటీసీ) బసిరెడ్డి, జిల్లా రవాణా అధికారి సీతారామిరెడ్డి, టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ మల్లికార్జున, శ్రీశైలం ఆలయ చైర్మన్ చక్రపాణి, తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఆర్వో వర్మ, టీటీడీ కల్యాణకట్ట నాయీబ్రాహ్మణులు, సంగీత కళాశాల విద్వాంసులు అభినందించారు.

చేసిన మేలును గుర్తించి ఆదరించండి



ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలో నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించాలని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం కొత్తకండ్రిగ, కొత్తకండ్రిగ ఎస్టీకాలనీ, గణేశ్వరపురం, గణేశ్వరపురం ఏఏడబ్ల్యూ, కన్నికాపురంలో గడప గడపకూ మీ హర్షిత్‌రెడ్డి కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను అధికారులతో చర్చించి అక్కడికక్కడే పరిష్కారం చేశారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, ఆర్సీపురం ఇన్‌చార్జి గణపతి నాయుడు, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, మునీంద్రబాబు, రాజేష్, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, సర్పంచి గణపతిరెడ్డి, నాయకులు భానుకుమార్‌రెడ్డి, బాబునాయుడు, యోగానందరెడ్డి పాల్గొన్నారు.

నాసా అవార్డులు ప్రదానం



అవార్డులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరిలోని శ్రీ చైతన్య స్కూల్లో సోమవారం నాసా అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. ప్రిన్సిపాల్ జలీల్‌బాషా మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ చక్కని ప్రణాళికతో గొప్ప విజయాలు సాధించాలని కోరారు. మాజీ రాష్ట్రపతి ప్రముఖ అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. చంద్రగిరి శ్రీ చైతన్య స్కూల్లో 25 మంది విద్యార్థులు నాసా పోటీల్లో పాల్గొనగా పదిమందికి అవార్డులు రావడం హర్షించదగ్గవిషయమన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే మన కర్తవ్యం

భాకరాపేట : ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించడమే కర్తవ్యమని భాకరాపేట వైద్యాధికారిణి శశికళ తెలిపారు. చిన్నగొట్టిగల్లులో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో సోమవారం ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం ఆగస్టు 7 నుంచి 12 వరకు, సెప్టెంబరు 11 నుంచి 16వ తేదీ వరకు, అలాగే అక్టోబర్ 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అలాగే తల్లి పాల వారోత్సవాలు నిర్వహించి తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు తేజశ్విని, సీహెచ్‌వో శేషకుమారి పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించండి

తిరుపతి అర్బన్: పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జేసీ డీకే బాలాజి తెలిపారు. ఆయన సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మిషన్ ఇంద్రధనస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి గర్భిణులు, 5 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి టీకాలు వేయాలన్నారు. ఆగస్టు 7 నుంచి 12వ తేదీ వరకు, సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు, అక్టోబర్ 9 నుంచి 14 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. డీఎంహెచ్‌వో శ్రీహరి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి శాంత కుమారి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జయలక్ష్మి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి అరుణ సులోచన దేవి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో ఆదరణ



చెర్లోపల్లిలో పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి, సర్పంచ్ సుభాషిణి

తిరుపతి రూరల్: చెర్లోపల్లి గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి సోమవారం గడప గడపకూ ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ఆమెకు సర్పంచ్ బొల్లినేని సుభాషిణి, ఆమె భర్త శుభగిరి నాయుడు ఘన స్వాగతం పలికారు. చెవిరెడ్డి లక్ష్మి ప్రతి గడపకూ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం, ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఇంకా చేయాల్సిన పనుల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆమె కొత్త చెర్లోపల్లి చెంచునగర్‌లో రూ.కోటితో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. అంతకు ముందు జూ పార్క్ రోడ్డులోని తులిప్స్ అపార్ట్‌మెంట్ వద్ద స్థానికులు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయించాలని చెవిరెడ్డి లక్ష్మిని కోరారు. రూ.40 లక్షలతో అక్కడ కూడా పనులు చేపడతామని సర్పంచ్ సుభాషిణి హామీ ఇచ్చారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ అభిమాని సుబ్బరామనాయుడు ఇంటికి వెళ్లి రూ.10 వేలు సాయం అందించారు.

ఆలయాన్ని కూల్చనీయం!



యంత్రాన్ని అడ్డుకుంటున్న గ్రామస్తులు

భాకరాపేట: 'ప్రాణాలైనా తీసుకుంటాం.. ఆలయాన్ని కూల్చనీయం' అంటూ భాకరాపేట గ్రామస్తులు భీష్మించారు. స్థానికంగా నిర్మించిన ధర్మరాజస్వామి ఆలయాన్ని సోమవారం కూల్చేందుకు చిన్నగొట్టిగల్లు తహసీల్దార్ లోకేశ్వరి, ఎంపీడీఓ దేవేంద్రబాబు యత్నించగా వారు అడ్డుకున్నారు. అధికారులు మాట్లాడుతూ భాకరాపేట రెవెన్యూ గ్రామలెక్క దాఖలా సర్వే నం.22లో ప్రభుత్వ భూమి ఉందని, ఇందులో ధర్మరాజస్వామి ఆలయాన్ని నిర్మించి మహాభారతం యజ్ఞం జరుపుకుంటున్నారని తెలిపారు. దీనిపై ఇదే గ్రామానికి చెందిన సుందరరాజుగుప్తా హైకోర్టును ఆశ్రయించారని, ఈ క్రమంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలంటూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఆలయం అక్రమ నిర్మాణం కాదన్నారు. కొంత సమయం ఇస్తే తాముకూడా కోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. దీంతో అధికారులు చేసేది లేక వెనుదిరిగారు.

చేనేత కార్మికులకు అండగా నిలుస్తాం



వస్త్ర ప్రదర్శశాలను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్

తిరుపతి అర్బన్: చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని జేసీ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత, జౌళిశాఖ నేతృత్వంలో ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శనను నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో చేనేత కార్మికుల కష్టాలను తెలుసు కొని, అధికారంలోకి వచ్చాక నవరత్నాల్లో భాగంగా వైఎస్ఆర్ నేతన్న నేస్తం కింద ఏటా రూ.24,000 చేనేత కార్మికులకు ఇస్తున్నారని తెలిపారు. జిల్లాలో 5,771 మంది చేనేత కార్మికులకు రూ.2,750 చొప్పున వృద్ధాప్య పెన్షన్ ఇస్తున్నట్లు చెప్పారు. తిరుపతి జిల్లా వెంకటగిరి భావన రుషి చేనేత క్లస్టర్ లో 395 మందికి మొదటి విడతగా రూ.41.25 లక్షలు, 369 మందికి చెన్నూరు బ్లాక్ లెవెల్ చేనేత క్లస్టర్‌కు మొదటి విడతగా రూ.35.83 లక్షలు ఇచ్చా రని చెప్పారు. అలాగే ముద్ర పథకం కింద రుణాల మంజూరు, అనంతరం చేనేత కార్మికులు ఏసీ కుట్టియప్ప మొదలి(నారాయణవనం), విలంబి (పుత్తూరు), పట్నం రమేష్ (వెంకటగిరి), కరుణాకర్(వెంకటగిరి)ను సన్మానించారు. ఆప్కో ప్రతినిధి రాజారాం, ఇన్‌చార్జ్ మేనేజర్ రమేష్ కుమార్, ఏఎంఓ గోపాల కృష్ణ, డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీదేవి, ఏడీఓలు సుబ్బనాయుడు, కిరణ్‌కుమారి పాల్గొన్నారు.

చేనేత రంగాన్ని ప్రోత్సహించాలి

పాకాల : ప్రజలు, ప్రభుత్వం చేనేత రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.మొహిద్దీన్‌బాషా తెలిపారు. కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ విభా గం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవో కె.ఈశ్వర్‌బాబు మాట్లాడుతూ నేటి యువత వారానికి ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించడం ద్వారా చేనేత రంగానికి చేయూతనివ్వాలన్నారు. భారతీయ సంస్కృతికి ప్రతీక అయిన చేనేతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. జేఏసీ సమన్వయకర్త ఎస్వి.రమేష్‌కుమార్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల మహా ధర్నాలో ఉద్రిక్తత

- ఆందోళనకారుల అరెస్ట్

తిరుపతి రూరల్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎంపీ మధు డిమాండ్ చేశారు. విద్యుత్ కార్మిక సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేపట్టారు. వారికి మాజీ ఎంపీ మధు సంఘీభావం తెలిపారు. అంతకు ముందు మహాధర్నాలో పాల్గొనేందుకు వస్తున్న మాజీ ఎంపీ మధు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, వేణుగోపాల్‌ను పోలీసులు అడ్డుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కార్మికులు కార్పొరేట్ కార్యాలయం నుంచి సర్కిల్ వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం కార్పొరేట్ కార్యాలయంలో డిస్కం అధికారులతో చర్చలు జరిపారు. ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే ఎమ్మెల్యే చెవిరెడ్డి ధ్యేయం



మందులు అందజేస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజల ఆరోగ్య సంరక్షణే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ చంద్రగిరి మండల కన్వీనర్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి, మిట్టపాలెంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాలు ప్రారంభించారు. రామిరెడ్డిపల్లిలో తిరుపతి నరేంద్ర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, మిట్టపాలెంలో రష్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు పలువురికి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొటాల పద్మజ, ఎంపీడీవో రమేష్‌బాబు పాల్గొన్నారు.

పాఠశాల స్థలం కబ్జా

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం మూలపల్లి పాఠశాల స్థలాన్ని గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టాడు. స్థానికులు ఫిర్యాదు చేసినా వీఆర్వో సుబ్రమణ్యంనాయుడు పట్టించుకోకుండా అక్రమార్కులకు వత్తాసు పలికారు. అతని తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో తహసీల్దార్ శిరీష ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులను పరిశీలించి అక్రమమైతే వెంటనే తొలగించాలని వీఆర్వో సుబ్రమణ్యంనాయుడిని ఆదేశించారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

పాకాల : మండలంలోని ఇరంగారిపల్లిలో సోమవారం డీఆర్సీ ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రత్నప్రసాద్ మాట్లాడుతూ మామిడి కోతల అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సుధాకర్, ఉద్యానవనశాఖ అధికారిణి శైలజ, ఏఓ పుష్పావతి, ఏఈఓలో రమేష్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ తొలి వీసీకి ఘన నివాళి

తిరుపతి సిటీ : ఎస్వీయూ అభివృద్ధికి తొలి వీసీ ఆచార్య గోవిందరాజులు నాయుడు ఎంతో కృషి చేశారని వీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. తొలి వీసీ గోవిందరాజులు నాయుడు వర్ధంతిని సోమవారం నిర్వహించారు. యూనివర్సిటీలోని గోవిందరాజులునాయుడు విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రిన్సిపాళ్లు పద్మనాభం, రామకృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ శ్యాం మోహన్, డేవిడ్ కుమార్ రాజు. దామోదర రెడ్డి, డీన్లు బీవీ మురళీధర్, విజయభాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరత్ శర్మ విష్ణుపురాణ ప్రవచనం

తిరుపతి కల్చరల్: అన్నమాచార్య కళామందిరంలో సోమవారం శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ నిర్వహించిన విష్ణుపురాణం ప్రవచనం ఆకట్టుకుంది. ఆయన పురాణాలను నేటి సమాజానికి ఏవిధంగా అన్వయించుకోవాలో తెలియజేశారు. ఆయనను రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి శాలువతో ఘనంగా సత్కరించారు.

రైతులకు అన్నదానం

పాకాల : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వారపు సంతలో సోమవారం రైతులకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో అన్నదానం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతూ రైతులు, చిన్న వ్యాపారులు ఇబ్బంది పడకుండా అన్నదానం చేస్తున్నట్టు చెప్పారు.

అగ్ని ప్రమాదాల నివారణపై ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ

తిరుపతి సిటీ : అగ్ని ప్రమాదాల నివారణపై సోమవారం 35ఏ బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లకు కమాండింగ్ ఆఫీసర్ అజయ్ బస్‌నెట్ శిక్షణ నిచ్చారు. అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో ఎన్‌సీసీ క్యాడెట్లు ఎలా స్పందించాలో వివరించారు. పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు.

వీసీకి ఏబీవీపీ వినతిపత్రం సమర్పణ

తిరుపతి సిటీ : ఎస్వీయూలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వొద్దని ఏబీవీపీ నేతలు కోరారు. వారు వీసీ రాజారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సోమవారం యూనివర్సిటీ బంద్‌కు పిలుపునిచ్చారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఇదిలా ఉండగా డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి అందరితోనూ చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకున్నారని, ఏబీవీపీ నాయకులు రాజకీయ కుట్రతో ఇలా ప్రవర్తించడం దారుణమని వర్సిటీ ఉద్యోగ, విద్యార్థి సంఘాలు చర్చించుకుంటున్నాయి.

చోరీ కేసులో 8 మందికి జైలు

తిరుపతి లీగల్: తిరుమలలో వ్యక్తి నుంచి డబ్బు చోరీ చేసిన కేసులో ఏడుగురికి 40 రోజులు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.కోటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. గుజరాత్‌కు చెందిన సచిన్ ఆస్మక్ చౌహాన్, మహారాష్ట్రకు చెందిన దేవదాస్‌సోలంకి, హైదరాబాద్, గద్వాల్‌కు చెందిన సోనీ, పండిట్, మల్లికార్జున, రాజస్థాన్‌కు చెందిన రామ్, మధ్యప్రదేశ్‌కు చెందిన ఆకాష్ సంజయ్‌తోర్, చిక్‌బళ్లాపూర్ జిల్లాకు చెందిన కె.వెంకటరమణ ఈ ఏడాది జూన్ 27వ తేదీన తిరుమలలో భక్తుడి నుంచి రూ.1500 చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు వారిని అరెస్టు చేశారు. నిందితులు నేరం అంగీకరించడంతో ఏడుగురికి 40 రోజులు, ఏడో నిందితుడు వెంకటరమణకు 37 రోజుల జైలు శిక్ష విధించారు.

చీటింగ్ కేసులో ఒకరికి రెండేళ్లు..

చీటింగ్ కేసులో కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన యార్లగడ్డ ప్రవీణ్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తిరుపతి ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత సోమవారం తీర్పు చెప్పారు. తిరుపతికి చెందిన పి.రామాంజనేయులు, కోనేటి లోకేష్ వర్మ, హాజీ సయ్యద్ నాజర్ అహ్మద్‌తో కలిసి ప్రవీణ్ 2014లో లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో తిరుపతిలో కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రవీణ్‌కు ముగ్గురూ రూ.22.22 లక్షలు ఇచ్చారు. అతను తన పేరుతో డబ్బు జమ చేసుకున్నాడు. దీనిపై రామాంజనేయులు 2014 డిసెంబర్‌లో తిరుపతి సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐలు కేసు దర్యాప్తు చేశారు. న్యాయమూర్తి కేసు విచారించి నిందితుడు ప్రవీణ్‌కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఉద్యమకారుడు గద్దర్‌కు ఘన నివాళి

చంద్రగిరి(తిరుపతి రూరల్): ప్రముఖ ఉద్యమకారుడు, గాయకుడు గద్దర్ మృతి దేశానికి తీరని లోటని చంద్రగిరి బీఆర్ అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బాదూరు ఎల్లయ్య తెలిపారు. చంద్రగిరి టవర్ క్లాక్ సర్కిల్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

తిరుపతి సిటీ : తల్లి పాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యంగా కలుగుతుందని మహిళా వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం రీడర్ ఉమాదేవి తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం హ్యూ మానిటీస్ బ్లాక్‌లో విద్యార్థినులకు పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతపై మహిళలు అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలో తల్లిపాల సంస్కృతి పెరుగుతుందని తెలిపారు.

నేడు మండల సమావేశం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొంటారని, మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కో–ఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.